రమాయణం

**చాలా ఏళ్లపాటు దగ్గర్లోనే ఉన్నా.. వాళ్ల ఇంటికి వెళ్లడం సరళక్క ద్వారానే మొదలైంది. వాళ్లింటి పేరు 'బండారి' అయినా.. 'బంగ్లోళ్ల ఇల్లు' అనే వారంతా. ఆ ఇల్లు దాటి మరో మూడిళ్లు కాగానే.. పోస్ట్ ఆఫీస్ నర్సయ్య వాళ్లిల్లు. అది దాటగానే పెద్ద చెరువు. అటువైపు ఊరు అక్కడికే ఆఖరు.**

# బంగ్లోళ్లు

పోస్ట్ మాస్టర్ గిరీ ఒకప్పుడు వంశ పారంపర్యంగా మా నాన్న పేరిట ఉండేదట. కానీ, సెవెంత్ పాస్ అయిన మాఊరి పిల్లగానికి ఇద్దామని మా చిన్నాయనకు కాకుండా.. ఆయన స్నేహితుడైన నర్సయ్యకు నాన్నే ఇప్పించాడట.

బంగ్లోళ్ల ఇంటిపెద్ద సుదర్శనంగారు అప్పటికే చనిపోయారు. వాళ్ల పెద్దకొడుకు శ్రీహరిగారు వకీలు. నాన్న ఇంటి బాధ్యతలు చేపట్టి పద్నాలుగేళ్ల వయసులో వ్యవసాయం చేస్తూ.. నాట్లు, కోతలు, కుప్ప నూర్పిళ్ల సమయంలో భోజనానికి కూడా ఇంటికి రాకుండా ఉండేవారట. అప్పుడు పక్కనే తమ పొలంలో ఉన్న సుదర్శనంగారు.. ''ఎంతసేపు భోజనం చేయకుండ ఉంటరు? మీరు ఇంటికి పోయి రాండ్రి. మీ పని ఆగకుండ జూస్తలేండి'' అనేవారట. అంత పెద్దవాడు అయినా.. తనపట్ల ఎంతో ప్రేమగా, స్నేహంగా ఉండేవాడని నాన్న చెప్పేవాడు.

సుదర్శనంగారి భార్య మా ఇంటికి వచ్చి కూచుని నానమ్మ, చిన్న నానమ్మలతో ముచ్చట్లు పెట్టేదట. చిన్నప్పుడు ఆమెను చూసిన జ్ఞాపకం ఉంది నాకు. ఆమె కూతుళ్లందరూ మా మేనత్తలకు స్నేహితులు. ఇక శ్రీహరిగారి పిల్లలందరూ.. మా ఇంట్లో ఎవరో ఒకరికి క్లాస్‌మేట్స్, స్నేహితులు కూడా. శ్రీహరిగారి పెద్దల్లుడు (మేనల్లుడే) ప్రముఖ సంగీత గురువు ప్రొ.తిరుపతయ్యగారు (వరంగల్).. చిన్నప్పుడు మా ఇంటికి కూడా వచ్చేవారట. శ్రీహరిగారి ముగ్గురు అమ్మాయిల్లో చిన్నదైన సరళక్క మా అక్కకు క్లాస్‌మేట్. సరళక్క తమ్ముడు ప్రభాకర్ నా క్లాస్‌మేట్. ఆ తరువాత మరో ముగ్గురు తమ్ముళ్లు.. మా కజిన్స్‌తోపాటు చదివేవాళ్లు. అయితే సరళక్క మొదట్లో వరంగల్‌లో వాళ్ల చిన్నాయన దగ్గర ఉండి చదువుకుంది. తొమ్మిది, పది తరగతుల కోసం మళ్లీ మా ఊర్లో జాయినైంది.

నేనూ, ప్రభాకర్, అక్కా, సరళక్క.. మేమంతా హైస్కూల్‌కు వెళ్లేటప్పుడు, అడ్డదారిలో పొలాల గట్ల మీద నుంచి గనెబండ పక్కగా వెళ్లేవాళ్లం. పలకలు పలకలుగా వెడల్పుగా, ఎత్తు పల్లాలుగా ఉండే ఆ గనెబండ మధ్యలో ఒక నీటి చెలిమె ఉండేది. మధ్యాహ్నం లంచ్ చేసి పరిగెత్తినట్టుగా బడికి వచ్చేవాళ్లం గనుక.. ఒక్కోసారి మాకు బాగా దాహం వేసేది. అందరమూ వెళ్లి చెలిమెలో ఊరిన నీళ్లను దోసిళ్లతో తీసుకుని తాగేవాళ్లం.


సరళక్కకు చాలా ధైర్యం. మేం ఏనాడూ సార్లకు ఎదురు చెప్పేవాళ్లం కాదు. ముందుగా లీవ్‌లెటర్ ఇవ్వకుండా స్కూల్ మానేసి, తెల్లారి వెళ్లినా.. ఏ కారణం చేతనైనా హోమ్‌వర్క్ చేయకపోయినా.. క్లాస్‌లో సార్ నిలబెట్టి అడిగితే గొంతు వణికి, అరచేతులు చెమటలు పట్టేవి. అబద్ధం చెప్పొద్దని ఇంట్లో అమ్మ స్ట్రిక్ట్ ట్రైనింగ్ వల్ల అబద్ధం ఆడటం కూడా వచ్చేది కాదు.

అలాంటిది సరళక్క ఎక్కువగా లెక్కల క్లాస్‌లో హోమ్‌వర్క్ చేయకపోతే సార్ నిలబెట్టి.. ''ఏమమ్మా! హోమ్‌వర్క్ ఎందుకు చేయలేదు?!'' అని అడిగితే.. ''చెయ్యలేదు సార్!'' అనేదట. ''అదేనమ్మా! నేనడిగేది. ఎందుకు చేయలేదనే! అర్థం కాలేదా? ఒంట్లె బాగలేదా? చుట్టాలొచ్చింరా? ఏమైంది?!'' అంటూ మల్టిపుల్ ఆన్సర్స్ చాయిస్ ఇచ్చినా కూడా.. ''చేయలేదు సార్!'' అనే జవాబు తప్ప, మరొకటి వచ్చేది కాదట. అడిగీ అడిగీ ఆయనకే విసుగొచ్చి.. ''సరె తియ్యి. నువ్వు జెప్పవు గానీ ఇగ కూచో!'' అనేవాడట. ఇదంతా అక్క చెప్పి.. ''అమ్మో! సరళకైతే భయమే లేదు'' అనేది.

మధ్యాహ్నం లంచ్ టైంలో ఇంటికి వచ్చి అన్నం తిని వెళ్లేవాళ్లం మేమంతా. మా ఇల్లు దాటి ఇంకా ముందుకు వెళ్తేనే వాళ్లిల్లు. అయినా కూడా ఐదు నిమిషాల్లోనే వచ్చేసేది సరళక్క. నేను అన్నం తిని జామకాయలో, రేగ్గాయలో తెంపే పనిలో ఉండేదాన్ని. నానమ్మ సరళక్కతో.. ''గంతల్నె ఎట్లొస్తివే పిల్లా! అసల్కు అన్నం తిన్నవా.. మంచీళ్లు తాగి ఒచ్చినవా?! మా ఇంట్ల తిను'' అనేది. ''అయ్యో! తిన్ననమ్మా!'' అనేది సరళక్క. ''అయితె ఏం కూరో చెప్పు?'' అని క్రాస్ ఎగ్జామిన్ చేసేది నానమ్మ వదలకుండా. ఇక పాపం ఒక్కోసారి తానేమీ చెప్పలేక నవ్వేది సరళక్క. తరువాత అక్కతో.. ''మీ నానమ్మ గట్ల అడుగుతదేందే సంధ్యా? మా ఇంట్ల ఇవ్వాళ చికెన్ అని ఎట్ల జెప్పాలె?'' అనేది. ''చెప్పాలె! ఏమయితది?!'' అనేది అక్క. వాళ్లింట్లో అందరూ మమ్మల్ని 'అమ్మా' అని సంబోధించేవారు. సరళక్క, ప్రభాకర్ కూడా నన్ను 'రమా!' అన్నా.. మళ్లీ 'ఏందమ్మా!' అనేవారు. మేం వాళ్లింటికి వెళ్తే కాల్చిన పల్లీలు, మక్కజొన్న కంకులు ఇచ్చేవారు. వాళ్ల వదిన మమ్మల్ని కూడా ''మా ఆడబిడ్డలు'' అంటుంది ఇప్పటికీ. మా ఇంట్లోలాగే వాళ్లింట్లో కూడా చాలా చెట్లు, పూల మొక్కలు ఉండేవి. చింతచెట్టు కాయలు తీపి, పులుపు కలిసిన రుచితో బావుండేవి. వాళ్ల తమ్ముళ్లు తెంపి ఇస్తే తినేవాళ్లం. ఓసారి వాళ్లింట్లో పనిచేసే ఆమె కూతురు మా ఇంటికి వచ్చి.. ''పెద్దమ్మ కొన్ని టంకాభ్రమం గింజలు పెట్టమన్నది'' అనడిగింది. అమ్మకేమీ అర్థం కాక మమ్మల్ని అడిగితే మాకూ తెలియలేదు. అప్పుడు ఫోన్లు లేవు కదా! ఒక ఐడియా వచ్చి.. ''మీ అమ్మకు ఏమి కావాల్నో ఒక కాయితం మీద రాయించుకరా!'' అని చెప్పి పంపాం. మళ్లీ రాలేదా పిల్ల. ''పాపం! వాండ్లకు ఏమి అవుసరం ఉండెనో, కొంచెం సేపుంటె ఆ పిల్ల చెప్పునో ఏమో!'' అని మా మదర్ ఇండియా ఒకటే బాధపడింది. తెల్లారి పొద్దున సరళక్కను అడిగితే చెప్పింది.. ''అయ్యో! కనకాంబరం పూలగింజల కోసం తోలితె దానికి ఆ పేరే నోరు తిరుగనట్టుంది'' అని! వాళ్ల ఇంట్లో మిద్దెపైన ఒక చిన్న హాల్, మరో చిన్న రూమ్, మిగతాది డాబా ఉండేది. ఆ రూమ్ సరళక్కది. తను ఓ ట్రాన్సిస్టర్‌లో పాటలు వినేది. ప్రతి బుధవారం అక్కను.. ''బినాకా ఇందాం రావే సంధ్యా!'' అని పిలిచేది సరళక్క. అప్పుడప్పుడూ అక్క, చాలా తక్కువగా నేను కూడా వెళ్లేవాళ్లం. అమీన్ సయానీ వ్యాఖ్యానం అలవాటై హిందీ బాగా తెలిసేది. ఎన్నో గొప్ప పాటలు ఆ 'బినాకా గీత్ మాలా' ప్రోగ్రాంలో వినేవాళ్లం.

ప్రతి బతుకమ్మ పండుగకూ వాళ్లింట్లో సందడిగా ఉండేది. సరళక్కతో కలిపి వాళ్లు తొమ్మండుగురు సంతానం కావడంతో పిల్లలతో కలిసి సుమారు పాతిక మంది దాకా ఉండేవారు. చుట్టాలు కాస్త తగ్గిన ఆ తరువాతి రోజుల్లో.. ''మనింట్లో కూడా అంతమంది ఉంటే ఎంత బాగుండు?!'' అని అక్కా, నేనూ అనుకునేవాళ్లం. ''ఇంకా నయం!'' అని నవ్వేది అమ్మ.

వాళ్లెవరూ ఇప్పుడు ఊళ్లో ఉండటం లేదు. మా ఇంటిని ఆనుకుని ఉన్న బురుజును కూల్చి వాళ్లింటి కెళ్లే దారిలో ఉన్న పెద్ద ఊరబావిలో ఆ రాళ్లనూ, మట్టినీ వేసి పూడ్చేసి.. ఆ జాగాలో బడి కట్టారు. ఎప్పుడైనా చెరువు వైపు గానీ, బడిలో ఓటు వేయడానికి గానీ వెళ్లినప్పుడు పాడుబడ్డట్టున్న బంగ్లోళ్ల ఇంటికేసి చూస్తే చాలా బాధేస్తుంది. ■






**నెల్లుట్ల రమాదేవి**
రచయిత్రి